
ప్రజాశక్తి
ఆదివారం 28 జులై 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పరిధిలోని మల్లికార్జున పురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మనుమసిద్ధి నగర్ నందు గుంటూరు జోన్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ వీరాజు ఈ బందంతో శుక్రవారం రాత్రి దోమల వద్ధి చెందు ప్రదేశం, లార్వా సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. కొన్ని ఇళ్లలో దోమలను కూడా పట్టుకొని పరీక్షకు పంపించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం, శీతాకాలంలో దోమల వద్ధి ఎక్కువగా ఉంటుందన్నారు. దోమలు వద్ధి చెందే ప్రదేశాల్లో లార్వాను సర్వే ద్వారా గుర్తించి ప్రజలకు అవగాహన సంబంధిత ఏరియా ఆశా కార్యకర్త, ఎఎన్ఎమ్ కల్పించాలన్నారు. లార్వా దశలోనే గుర్తించి నిర్మూలించాలని వారానికి ఒకసారి తప్పనిసరిగా ఫ్రైడే డ్రై డే కార్యక్రమము సక్రమముగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారిణి ఈ. హుసేనమ్మ ఉన్నారు.



ఇద్దరు కలెక్టర్ల ఆదేశాలు బుట్టదాఖలు..!

- అల్లీపురంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ఇరిగేషన్ భూమి 6.30 ఎకరాలు ఆక్రమణ
- రాజకీయ నేతలకు గులాం...అధికారులంటే నో కేర్


నెల్లూరు నగరంలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణ చేసి నిర్మాణాలు యథేచ్ఛగా చేపడుతున్నారు. గత అధికారపార్టీ నేతల అండదండలతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డదిడ్డంగా వ్యవహరించారు. అప్పటి నేతలు చెప్పిందే వేదంగా రెవెన్యూ, నుడా, ఇరిగేషన్, అధికారులు పనిచేశారనడానికి ఉదాహరణ అల్లీపురం గ్రామంలో జరిగిన అంశం. ఇద్దరు కలెక్టర్లు కెవిఎన్ చక్రధర్‌బాబు, హరినారాయణన్ ఆదేశాలు జారీ చేసినా అప్పటి అధికారపార్టీ నేతలు చెప్పిందే వేదంగా అధికారులు పనిచేశారనే విమర్శలున్నాయి. అల్లీపురంలో జరిగిన అక్రమాలు అక్రమ లేవుట్ల విషయం ఒకవైపు ఉంటే, ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ప్లాట్లు తయారు చేశారు. అల్లీపురం గ్రామంలో ఇరిగేషన్‌కు చెందిన 6.30 ఎకరాలు ఆక్రమించి, ప్లాట్లుగా మార్చేశారు. 2022 ఆగస్టు 22న అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలు ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. అమలు చేయలేదు. హైకోర్టు ఆదేశాలు పాటించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించినా అతీగతి లేదు. అధికారులు రాజకీయ బెదిరింపులు, ఉద్యోగాల రక్షణ కోసం బయపడ్డారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అందరూ ఉలిక్కిపడుతున్నారు..

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు నుడా పరిధిలోనూ పెద్ద ఎత్తున అక్రమ లేవుట్లు సాగాయి. నుడా ఏర్పాటు నుంచి టిడిపి, వైసిపి నేతలు ఇద్దరు దీనిని ప్రోత్సహించారనే విమర్శలున్నాయి. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక మరింత రెచ్చిపోయి రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగించారు. 2020లోనే నుడా పరిధిలో 118 అక్రమ లేవుట్లు ఉన్నట్లు అశాఖ అధికారులు ఎప్పుడో గుర్తించారు. కార్పొరేషన్, నుడా, అనుమతులు లేకుండా, ఒక వేళ ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా ఇవి చేశారు. 40 అడుగులు ఉండాల్సిన రోడ్లు 30 నుంచి 20 అడుగులకు కుదించారు. సామాజిక అవసరాలు ఉండాల్సిన భూమిని కొందరు వదలలేదు. ఇవి అక్రమ లేవుట్లు అని తెలిసినా రిజిస్ట్రేషన్లు ఆగ లేదు. గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలు సాగాయి. మధ్య తరగతి ప్రజలు సొంతింటి కల కోసం లేవుట్లు చేసి భూములు కొనుగోలు చేశారు. ఇది నుడా పరిధిలో జరిగిన తంతే. ఇరిగేషన్ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని తెలుస్తోంది. అల్లీ పురంలో ఏకంగా ప్రభుత్వ భూమినే ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు. 2022 ఆగస్టు 22న ఈ విషయం అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు చర్యలకు ఉపక్రమించారు. రెవెన్యూ, నుడా, ఇరిగేషన్ అధికారులతో సర్వే చేయించారు. మొత్తం లే అవుట్‌లో 6.30 ఎకరాలు ఇరిగేషన్ భూములను ప్లాట్లుగా మార్చేశారని నివేదిక ఇచ్చారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్ నుడా అధికారులను, ఇరిగేషన్ భూములు స్వాధీనం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారుకు ఆదేశాలు జారీ చేశారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వైసిపి నేతలు బెదిరింపులకు భయపడి అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. . ఇరిగేషన్ కాలువలను పూడ్చేసి, ప్లాట్లు చేశారని తెలిసినా ఆ శాఖ అధికారులు చర్యలకు ముందుకు లేదు. తమకు ఒక్క ఎఇ మాత్రమే ఉన్నారని, అక్కడకు వెళ్తే తమను బెదిరిస్తున్నారని, తమకు ఎవరు రక్షణ ఇస్తారంటూ ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. కలెక్టర్ ఉత్తర్వులు అమలు కాకపోవడంతో అల్లీపురానికి చెందిన రైతులతోపాటు, సోమిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా ఇరిగేషన్ భూములను స్వాధీనం చేసుకోవాలని, అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అటు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయ లేదు. హైకోర్టు లేదు,... కలెక్టర్ లేదంటూ రెచ్చిపోయారు. అల్లీపురంలో ఇరిగేషన్ వివాదాస్పద స్థలంలో యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయి. ఏ ఒక్క అధికారి నిలుపుదల చేయడానికి ముందుకు వెళ్లడం లేదు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అల్లీపురంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది ఏం జరుగుతుందో చూడాలి.

ఇద్దరు కలెక్టర్ల ఆదేశాలు బేఖాతర్

నుడా పరిధిలో జరిగిన అవినీతి, అక్రమాలు ఒకటి. నిబంధనలు పాటించకుండా లేవుట్లు వేశారు. వాటికి అనుమతులు ఇచ్చారు. మరీ దారుణమైన పరిస్థితులు ఏమంటే అల్లీపురంలో ఇరిగేషన్ భూములను ఆక్రమించి ప్లాట్లుగా మార్చితే మూడేళ్ల పట్టించుకున్న పరిస్థితి లేదు. అల్లీపురంలో మొత్తం 32.63 ఎకరాల్లో ప్లాట్లు వేశారు. ఇందులో 3.91 ఎకరాలు ఇరిగేషన్ పరంబోకు, 2.39 ఎకరాలు ఇరిగేషన్ కాలువ కట్టలు అక్రమించి పాట్లు చేశారు. కలెక్టర్ చక్రధర్ బాబు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. అధికారులు ఎవ్వరూ లెక్క చేయలేదు. హైకోర్టు ఆదేశాలిచ్చినా పట్టించుకోలేదు. 2023లో కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాలతో అప్పటి జెసి కూర్మనాథ్ విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. అది బుట్టదాఖలైయింది. కలెక్టర్ ఆదేశించి, హైకోర్టు సీరియస్ అయినా నాకేమి అనేలా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, తమకు ఏమీ పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశాలపై విచారణ జరుగుతున్నందున ఏం జరుగుతుందో చూడాలి.



Rc.E4.1731/2022.

Collector's Office, Nellore
Dated.22.08.2022.

From
Sri K.V.N.Chakradhara Babu I.A.S.,
Collector & District Magistrate
SPS Nellore District, Nellore.

To
The Superintending Engineer, Irrigation, Nellore.
The Revenue Divisional Officer, Nellore
The Vice Chairman, NUDA, Nellore
The Tahsildar, Nellore Rural, Nellore

Sir,

Sub:- Spandana – SPS Nellore District – Nellore Rural Mandal – Navalakula Gardens H/o Allipuram Village – R/o Sri M Anil Kumar resident of Gudipallipadu Village, Nellore Rural Mandal against the violations on formation of Layouts in Allipuram Village – Certain instructions & directions issued – Action taken report called for – Reg.

Ref:- 1) R/o Sri Mekala Anil Kumar & others dt.25.07.2022.
2) Joint inspection Report dated.14.08.2022.
3) RDO, Nellore, Letter in Rc.E.1460/2022, dt.22.08.2022.

I invite your attention to the subject cited.

In the reference 3rd cited, the Revenue Divisional Officer, Nellore has reported that, the team of officers viz., Municipal Commissioner, Nellore Municipal Corporation, Nellore, Vice Chairman, NUDA, Nellore, Revenue Divisional Officer, Nellore & Executive Engineer, Irrigation, Nellore have conducted joint inspection on the layouts available at Allipuram Village of Nellore Rural on the allegation petition filed by Sri Mekala Anil Kumar S/o Sudhakar vide reference 1st cited & as per the Directions of the District Collector, Nellore vide Rc.E4.1731/2022, dated.13.08.22.

The Revenue Divisional Officer, Nellore has reported that, they have conducted field enquiry on Six (6) - Layouts and adjacent Agricultural Lands and noticed that certain Government Lands / Canal Bunds were encroached by the Layout owners / Developers and also converted the Agricultural Land into Non – Agricultural Purpose by forming House Site Layouts without getting prior approval

2022లో అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశాలు జారీ చేసిన నకలు

'సోమశిల'కు 10 టిఎంసిల నీరు విడుదల చేయాలి

జెసికి రైతుసంఘాలు వినతి

ప్రజాశక్తి - నెల్లూరు : జిల్లా రైతాంగం వరి నాట్లు వేసుకొనేందుకు అవసరమైన నీటిని పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి సోమశిల ప్రాజెక్టుకు 10 టిఎంసిల నీటిని విడుదల చేయా లని కోరుతూ ఎపి రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఎపి రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకత్వం కలిసి తమ సమస్యలను తెలిపారు. రైతు సంఘాల నాయ కులు మాట్లాడుతూ ప్రస్తుతం సోమశిల ప్రాజెక్టులో కేవలం 10 టిఎంసిల నీరు మాత్రమే ఉన్నాయన్నారు. ఈ నీటిలో 7 టిఎంసిలు డెడ్ స్టోరేజీ కింద పరిగణలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. మిగిలిన 3 టిఎంసిల నీరు నెల్లూరు, గూడూరు, కావలి, తిరుపతి ప్రాంతాలకు చెందిన ప్రజల దాహార్తి తీర్చేందుకు సరిపోతా యన్నారు. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆల్మట్టి, తుంగభద్ర ఇతర జలాశయాలు నీటితో నిండటంతో శ్రీశైలం జలాశయానికి వరద నీరు విపరీతంగా వచ్చి చేరుతుందన్నారు. ఈ వరద నీటిని వృథాగా వదిలివేయకుండా 10 టిఎంసిల నీటిని సోమశిల ప్రాజెక్టు కేటాయించేలా చర్యలు తీసు కోవాలన్నారు. సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్ మాట్లాడుతూ రైతాంగ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ ,రైతు సంఘం అధ్యక్షులు పి శ్రీరాములు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి గోపాల్ ,అధ్యక్షులు ఎం గుర్నాథం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం పుల్లయ్య, అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమ్మ రాజు, నాయకులు బుజ్జయ్య పాల్గొన్నారు



జెసికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

'సోమిరెడ్డి' అవినీతిపై విచారణ జరిపించాలి : కాకాణి

ప్రజాశక్తి -నెల్లూరు సిటీ : ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచారణ జరిపించాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. సర్వేపల్లిలో సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకు రాజగోపాల్ రెడ్డి ల అవినీతి, అక్రమాలపై చంద్రబాబు విచారణ జరిపించి వాస్తవాలు బయటపెట్టాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో చంద్రబాబు, ఎంఎల్ఎలు అసత్యాలు.. అబద్దాలను చర్చించి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారన్నారు. పాములు లేస్తే ఏలిక పాము కూడా లేచినట్లు సోమిరెడ్డి మాట్లాడాడని తెలిపారు. సోమిరెడ్డికి మందు బ్రాండ్లపై ఉన్న అవగాహనను చూసి చంద్రబాబు కూడా ఆశ్చర్యపోయాడని ఎద్దేవా చేశారు. సోమిరెడ్డి సప్త వ్యాసనాలు కలిగి ఉన్న వ్యక్తి అని చంద్రబాబుకు తెలిసినట్లు లేదని వ్యాఖ్యానించారు. సోమిరెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన మాయ మాటలపై... ఎటువంటి విచా రణ చేపట్టినా తాను సిద్ధంగా ఉన్నానని తెలిపాఉ.



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఫోర్జరీ కేసుపై విచారణ జరిపించాలి : సిపిఐ


ప్రజాశక్తి - నెల్లూరు సిటీ : కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన లో సంబంధించిన వ్యక్తుల మీద క్రిమినల్ కేసులు నమోదు చేయడం శుభ పరిణామమని, విశ్రాంత జడ్జి చేత విచారణ జరిపించి, సిబిఐకి ఈ కేసును అప్పచెప్పాలని సిపిఐ నగర కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్ చేశారు. నెల్లూరు సిపిఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఐఎఎస్ స్థాయి అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి, అపార్ట్‌మెంట్‌కు, కమర్షియల్ బిల్డింగ్స్ సంబంధించి భవన నిర్మాణాలు పూర్తి కాకుండానే మార్టిగేజ్ నగదును రిలీజ్ చేయడం దారుణమన్నారు.దీనిపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందన్నారు. సిపిఐ నగర నాయకులు వాటంబేటీ నాగేంద్ర, పి. జిలాని ఖాన్, పి. లీలామోహన్, ముక్తియర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పోషకాహార దినోత్సవం..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని సౌత్ ఆములూరు ప్రాథమికొన్నత పాఠశాలలో శనివారం శిక్ష సప్తహ్ పోషకాహార దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని జాతీయ విద్యా విధానం ఎన్.ఈ.పి 2020 ప్రవేశపెట్టింది. నాలుగో వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ దినోత్సవం వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ కె.ఎన్ బాలాజీ హాజరై మాట్లాడారు. పిల్లల్లో విద్యార్థి దశ నుండే పోషక విలువల గురించి అవగాహన కలిగించాలని ఎంపీడీఓ సూచిం చారు. మండల ఉపాధ్యక్షులు చెరుకూరు శ్రీనివాస నాయుడు ఆరోగ్య సూత్రాలు పాటిస్తున్న పాఠశాల విద్యార్థులకు అభినందనలు తెలిపారు. హెచ్ఎం షేక్ అహ్మద్ బాషా, సర్పంచ్ చెరుకూరు సరళ కుమారి, పంచాయతీ సెక్రెటరీ సి.హెచ్ విజయదుర్గ మాట్లాడారు. అనంతం టి.డి వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది సౌత్ ఆములూరు ఉపసర్పంచ్ చావా సుధారాణి, చావా రమేష్ నాయుడు, మండల ఇఒపిఆర్‌ఢి షేక్. అజీజ్, పాఠశాల కమిటీ చైర్మన్ ఆర్. స్వాతి, వైస్ చైర్మన్ వి. గిరిజ కుమారి., పాఠశాల ఉపాధ్యాయులు కె. వసంత లక్ష్మి, కె. విద్యుల్లత, బి. కష్ణవేణి ఉన్నారు.

సిపిఎం నాయకులు ముప్వా కొండయ్యకు పరామర్శ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలో ప్రముఖ హోమియోపతి డాక్టర్, సిపిఎం నాయకులు ముప్వా కొండయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యారు. శనివారం ఆలియండియా కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య కొండయ్యను పరామర్శించాఉ. ఆయన వెంట సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కోపూరు మాలకొండయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు, ఏఐవైఎఫ్ నాయకులు కే హరి బాబు ఉన్నారు.



ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు
నిజాయితీని నిరూపించుకోవాలి..

నెల్లూరు సిటీ : నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయంలో సంచలనం కలిగించిన కార్పొరేషన్ కమిషనర్ ఫోర్జరీ అంశానికి సంబంధించి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు తమ నిజాయితీని నిరూపించుకోవాల్సింది పోయి తాము గిరిజన జాతి అని చెప్పుకోవడం సరికాదని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె సిపించలయ్య పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని వెన్నెల కంటి రాఘవయ్య భవన్లో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ల సంతకాల ఫోర్జరీకి సంబంధించి ఆరోపణలు వస్తే నిజాయితీగా విచారణకు నిలబడి తమ నిజాయితీని నిరూపించుకోవాల్సిన మేయర్, ఆమె భర్త విచారణను తప్పించుకునేందుకు గిరిజనులమని చెప్పుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఫోర్జరీ అంశానికి సంబంధించి కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు. గిరిజనులకు అండగా నిలుస్తున్న నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై ఆరోపణలు చేయడం తగద`న్నారు. గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నేతలు కత్తి ఆదిశేషయ్య, తలపల చంద్రమౌళి, రాపూరి కష్ణయ్య మాణికుల మురళి మాకాని రవీంద్ర ఎల్లంపల్లి రమేష్, తిరువీధి సతీష్, చిందేటి ఉష మల్లిక ప్రభావతి ఉన్నారు.



మాట్లాడుతున్న కెసి పెంచలయ్య

'మాలకొండ'లో భక్తుల సందడి

ప్రజాశక్తి వలేటివారిపాలెం : మాలకొండలోని మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుంచి వివిధ రూపాల ద్వారా రూ.783556 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి కెబి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా 2, 31500 మంది భక్తులు దర్శించుకున్నారు. లడ్డూ ప్రసాదం ద్వారా 18, 9885 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్, నసింహ చార్యులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు : భక్తవత్సలనగర్‌లోని చిన్న కెవిఆర్ ప్రభుత్వ పాఠశాలలో సన్‌సైడ్ కూలి 9వ తరగతి విద్యార్థి గురుమహేంద్ర మృతిచెందిన ఘటనపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ శనివారం విద్యాశాఖ ఎడి గ్లోరీ కుమారిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి నరేంద్ర మాట్లాడుతూ చిన్న కెవిఆర్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 14 ఏళ్ల విద్యార్థి గురుమహేంద్ర పాఠశాల ఆవరణంలో సన్‌సైడ్ కూలి మృతిచెందడం బాధాకరమన్నారు. నాడు - నేడు కింద జరుగుతున్న నిర్మాణ పనులు పలు పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిన కారణంగా ఈ తరహా ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. పాఠశాల స్థాయికి మించి విద్యార్థులను చేర్చుకోవడం, విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా ఉపాధ్యాయుల సంఖ్య లేకపోవడం మరో కారణంగా ఉందన్నారు. జిల్లాలో జరుగుతున్న తరగతి గదుల నిర్మాణ పనులు నాశిరకంగా ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా జిల్లా అధికాఉలు స్పందించకపోవడం విచారకరమన్నారు. విద్యార్థి మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నగర నాయకులు జీవన్ ప్రకాశ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణ చేపట్టాలి

చిన్న కెవిఆర్ పాఠశాల తరగతి గది కిటికీ సన్ షేడ్ కూలి 9వ తరగతి చదువుతున్న గురు మహేంద్ర మతి చెందిన ఘటన పై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థిజెఎసి డిమాండ్ చేసింది. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ గ్లోరీ కుమారిని కలిసిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జెఎసి నాయకులు ఈ ఘటనపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి విద్యార్థి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ఆదిత్య సాయి మాట్లడారు. బిసిఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉల్లిపాయల మురళి కష్ణ యాదవ్, బాలు, వెంకటేష్, శివ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

కందుకూరు : నెల్లూరు నగరంలోని చిన్న కెవిఆర్ ప్రభుత్వ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గురు మహేంద్ర అనే విద్యార్థి సన్‌షెడ్ మతి చెందడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మెండా. శ్రీహర్ష ఓ ప్రకటనలో తెలిపారు. . విద్యార్థి మృతికి కారణమైన నాడు-నేడు పనుల కాంట్రాక్టర్, వాటిని పర్యవేక్షించడంలో విఫలమైన డిఇలపై చర్యలు తీసుకోవాలన్నారు.. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా గత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థి కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు.

వైసిపిలో లుకలుకలు..!

'బుర్రా'కు తెలియకుండానే ఆయన పేరిట ఖండనలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గ వైసిపిలో లుకలుకలు మొదలయ్యాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ కు తెలియకుండానే అనేకం జరిగిపోతున్నాయి. చివరకు బుర్రా పేరిట ఓ పత్రిక ప్రకటన ఆయనకు తెలియకుండానే విడుదలైంది. లింగసముద్రంలో శుక్రవారం జరిగిన ఘటనల నేపథ్యంలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. లింగసముద్రంలో రోడ్లు భవనాల శాఖకు చెందిన భూమిలో ఆక్రమణ తొలగింపు నేపథ్యంలో ఇవి జరిగాయి. అక్కడ వైసిపి నేత నేత ఒకరు రోడ్లు భవనాల శాఖ స్థలాన్ని ఆక్రమించారు.టిడిపి నేతల ఫిర్యాదుతో అధికారులు జెసిబి తో ఆక్రమణలు తొలగించారు. ఆ సమయంలో తొలగింపును అడ్డుకోవడానికి ప్రయత్నించిన వైసిపి నేత వరికూటి కష్ణారెడ్డి పై దాడి జరిగింది. దాడి జరిగిన కొద్దిసేపట్లోనే బుర్రా మధుసూదన్ యాదవ్ తో పాటు నియోజకవర్గ పార్టీ నేతలు ఆ దాడిని ఖండిస్తున్నట్లుగా సోషల్ మీడియాలో ప్రకటనలు వచ్చాయి. వాస్తవానికి ఈ ఖండనతో మధుసూధన యాదవ్‌కు సంబంధంలేదని తెలిసింది. బుర్రా ప్రస్తుతం బెంగళూరులో ఉన్నారు. ఆయన పేరుతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల వైసిపి నేతలు, జెసిఎస్ మండల కన్వీనర్ల పేరిట ప్రకటనలు వచ్చాయి. వారిలో కొంతమంది తమకు తెలియకుండానే తమ పేఇట ప్రకటనలు వచ్చాయని ప్రజాశక్తితో చెప్పారు. వైసిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు జాజుల కోటేశ్వరరావు పేరు కూడా ఆ ప్రకటనలో వచ్చింది. తనకు తెలియకుండానే ఎవరో ప్రకటనలో తన పేరు జోడించారని తెలిపాఉ. ఈ విషయమై ఆయన బుర్రా మధుసూదన్ యాదవ్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. లింగసముద్రంలో స్థానికుడైన కష్ణారెడ్డి మాజీ శాసనసభ్యుడు మానుగుట మహీధర్ రెడ్డికి సన్నిహితుడు. ఖండన ప్రకటనలకు చొరవ తీసుకున్న వైసిపి నేతలు కూడా మానుగుంట మహీధర్ రెడ్డికి సన్నిహితులేనని తెలిసింది. విచిత్రం ఏమిటంటే కష్ణారెడ్డి పై మొదటగా దాడి చేసిన వ్యక్తి టిడిపికి చెందిన వ్యక్తి కాదు. సాక్షాత్తు వైసిపికి చెందిన వ్యక్తి మొదటగా కష్ణారెడ్డిపై దాడి చేశారని తెలిసింది. ఆ తర్వాత టిడిపికి చెందిన వ్యక్తులు కొందరు కష్ణారెడ్డి పై దాడికి దిగారని తెలిసింది. రాజకీయ కారణాలతో కాక వ్యక్తిగత కక్షల వల్లనే ఈ దాడి జరిగిందని వినిపిస్తోంది. వైసిపికి చెందిన వ్యక్తి కష్ణారెడ్డిపై మొదటగా దాడి చేస్తే రాజకీయాలు ఆపాదించి దానిని టిడిపిపై ఎలా వేస్తారని వైసిపి అభిమానులే ప్రశ్నిస్తున్నారు.



విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : జిల్లా ఉపరవాణా కమిషనరు బి చందర్ ఆదేశాల మేరకు కందుకూరు ఓవి రోడ్ లోని వివేకా డిగ్రీ కళాశాలలో రహదారి భద్రతపై అవగాహనా సదస్సు శనివారం జరిగింది. కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్ కె యండి రఫీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ విలువైన జీవితాన్ని కాపాడుకోవడానికి ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలని, అక్కడి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను గురించి, రోడ్డు సేఫ్టీ అంశాల గురించి, హెల్మెట్ ప్రాధాన్యత గురించి సువివరంగా తెలిపారు. విద్యార్థులు, యువకులు అధిక స్పీడ్ తో వాహనాలు నడపడం మిక్కిలి ప్రమాదకరమని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఆర్టిఏ నిబంధనలకు లోబడి ప్రతి పౌరుడు వ్యవహరించాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమములో భాగంగా అసిస్టెంట్ మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్ మల్లికార్జున రెడ్డి ట్రాఫిక్ నిబంధనల గురించి విద్యార్థులకు వివరిస్తూ ట్రిపుల్ రైడింగ్ చేయకూడదన్నారు. విధిగా హెల్మట్ ధరించాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఏ విధంగా రక్షించాలి అనే అంశంపై 108. సిబ్బందితో కలిసి ఆయన విద్యార్థులకు డెమో నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు,విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవిఐ ఎస్‌కె ఎమ్‌డి రఫీ

అబ్దుల్ కలాంకు నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు : కొండాయపాళెంలోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో శనివారం భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు విద్యార్థులతో అబ్దుల్ కలాం చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, వాలంటీర్ రాశి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - వెంకటాచలం : మండలంలోని కాకుటూరు పంచాయతీ పరిధిలో ఉన్న గొలగమూడి రోడ్డు సమీపంలోనీ అక్షయపాత్ర ఫౌండేషను టిడిపి నాయకులు పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని అక్షయపాత్ర ఫౌండేషన్ మేనేజర్ గోవర్ధన్‌ని టిడిపి నాయకులు కోరారు. అస్తోటి నాగరాజు,అస్తొటి రవికుమార్,ముస్లిం మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ ఉన్నారు.

గర్భిణులకు టీకాలు

ప్రజాశక్తి -వలేటివారిపాలెం :గర్భిణులు, పిల్లలకు తప్పనిసరిగా టీకలు ఇవ్వాలని, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమా మహేశ్వరి సూచించారు. బడేవారిపాలెం ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా స్థానిక ఎఎన్ఎంలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రతి బిడ్డకూ వారి వయసును బట్టి ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని సూచించారు. శివరామయ్య,ప్రసాద రావు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించరూ..

ప్రజాశక్తి-గుడ్లూరు :గుడ్లూఉలో రక్షత నీటి పథకం పైపులైను విద్యుత్ అధికారుల కారణంగా పగిలిపోయి పదిరోజులైంది. తాగునీరు సరఫరా చేయకపోవడంతో స్థానిక బి కాలనీ ,గిరిజన కాలనీవాసులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. విద్యుత్ అధికారులు పొరపాటున నూతన విద్యుత్ స్తంభాన్ని నీటి పైపు లైన పై బిగించడంతో పైపులైను పగిలిపోయి రక్షిత నీరు వృథాగా నేలపాలైంది. దీంతో నీరు సరఫరా చేయకుండా ఆపేశారు. దీంతో గ్రామస్తులు ఆందోళన చేయడంతో స్పందించిన విద్యుత్ అధికారులు నీటి పైపు లైన్ పై వేసిన విద్యుత్ స్తంభాన్ని శనివారం తొలగించారు పగిలిపోయిన పైపు స్థానంలో మరమ్మతులు చేయకపోవడంతో నీటి సరఫరా ఒక కొలిక్కి రాలేదు.

ముగిసిన శిక్షణ

కందుకూరు : బోధనలో ఉపాధ్యాయులకు సహకారం అందించడానికే టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని సపోర్టింగ్ ఆంధ్ర స్కూల్ ట్రాన్స్ఫర్మేషన్ (ఎస్ఎల్టీ) ప్రాజెక్ట్ నిర్వహణలో భాగంగా ఆరష్ట్ర విద్యా పరిశోధన మండలి, సమగ్రశిక్ష సంయుక్తంగా హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, సిఆర్ఎంటిలకు 9 రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు ఎంఇఒ కె సుబ్బారెడ్డి అన్నారు. శనివారం కందుకూరు జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో ' టీచ్ టూల్ ' ట్రైనింగ్ ముగింపు సందర్భంగా శిక్షణార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంఇఒ మాట్లాడారు. హెచ్ఎం లు ఎం నరసింహమూర్తి, శ్రీనివాసులు, మాస్టర్ ట్రైనీలు, శిక్షణార్థులు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని చిన్న బజార్‌లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపించాని కోరుతూ సిపిఐ నాయకులు ట్రాఫిక్ డిఎస్పి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.శనివారం నగరంలోని ట్రాఫిక్ డిఎస్పి కార్యాలయంలో డిఎస్పిని సిపిఐ నాయకులు కలిశారు.ఈ సందర్భంగా సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్య చాలా ఎక్కువగా ఉంది ముఖ్యంగా చిన్నబజార్ అయితే చాలా ఘోరమైన పరిస్థితి నెలకొంటుందన్నారు. ప్రతినిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో వాహనదారులు, పాదాచారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షానవాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్, సిపిఐ నాయకులు షబ్బీర్, శంకర్, లతీఫ్ అహ్మద్, షాకీర్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రకతి వైపరీత్యాలను నిరోధించేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడం తప్పనిసరి అని సెట్నెల్ సిఇఒ వై.వెంకటయ్య అన్నారు. శనివారం, జిల్లా యువజన సంక్షేమ శాఖ-సెట్నెల్ విభాగం ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో వరల్డ్ నేచర్ కన్జర్వేషన్ డే సందర్భంగా బుజబుజ నెల్లూరులోని పి.ఎం.పి కార్యాలయం నుండి వండ్లూరు కాలనీ ఎంపిపీ స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపిపి స్కూల్ ఆవరణము నందు చెట్లు నాటే కార్యక్రమాన్ని సెట్నెల్ సీఈవో వై.వెంకటయ్య, వైఎస్ఆర్ నగర్ యు.పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ షేక్ ఇమ్రాన్ మాట్లాడారు. పి.హెచ్.పి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, అధ్యక్షులు, కోశాధికారి శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు ఉన్నారు.

లైంగిక వేధింపుల నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి -ఉలవపాడు :లైంగిక వేధింపుల నివారణకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాల్సిన అవసరముందని ఐసిడిఎస్ పిఒ సమతా మంజుల పేర్కొన్నారు. ఉలవపాడు మండలం వెలుగు కార్యాలయంలో శనివారం నాడు ఐసిడిఎస్ ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలకు "బేటి బచాఒ బేటి పడావో "కార్యక్రమం నిర్వహించారు. ఐ సి డి ఎస్ పి.ఓ సమతా మంజుల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సి.డి.పి.ఒ అరుణ పాల్గొని మాట్లడారు. ఎం.పీ.డీ వో విజయ, ఇన్చార్జి తాసిల్దార్ పి ఎస్ పి రామ్మూర్తి ,ఎల్ సి ఓ శారద ఉలవపాడు సూపర్వైజర్లు, అంగన్‌వాడీలు, మహిళా కార్యకర్తలు ,ఏ.ఎన్.ఎంలు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

వెంకటాచలం :జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె వాణి గారి ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వాణి ముద్దాయిల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భోజన వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. జైల్ సూపరింటెండెంట్ కే.రాజేశ్వరరావు అడిషనల్ సూపర్ మహేష్ బాబు డిప్యూటీ సూపర్నెంట్ ఫణి కుమార్ గారు లాయర్ హర్ష ఉన్నారు.

నేటి నుంచి ఎపిపిఎస్‌సి పరీక్షలు

నెల్లూరు :నగర సమీపంలోని పొట్టేపాలెం ప్రాంతంలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రంలో నేటి నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఎపిపిఎస్‌సి డిపార్ట్మెంటల్ పరీక్షలను నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు డిఆర్ఒ లవన్న తెలిపారు. శనివారం కలెక్టరేట్లో ఎస్ ఆర్ శంకరన్ హాలులో డిపార్ట్మెంటల్ పరీక్షల (నోటిఫికేషన్ నెంబర్ 09/2024) కోసం ఎపిపిఎస్‌సి నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షపై సమన్వయ అధికారులు, చీఫ్ సూపరిం టెండెంట్ తో డిఆర్ఒ లవన్న, ఎపిపిఎస్‌సి అధికారులు కష్ణవేణి, అంజన సమావేశం నిర్వహించారు.

పలుచోట్ల అబ్దుల్‌కలాం వర్ధంతి


అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బిట్రగుంట : భారతరత్న ఏపిజె అబ్దుల్ కలాం సాధారణ కుటుంబంలో జన్మించి అంచలంచెలుగా ఎదిగి రాష్ట్రపతిగా, నిస్వార్థ రాజకీయాలకు నిదర్శనం అబ్దుల్ కలాం అని మండల సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య, మండల సిఐటియు కార్యదర్శి చల్ల నరహరి, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా శనివారం బోగోలు మండలం ఇబ్రహీంపేట సిపిఎం కార్యాలయం వద్ద ఉన్న అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగి ఏనుగుల విజయ ప్రతాప్ రెడ్డి, మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు దాసరి సునీల్, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ నాయకులు ఎత్తి రాజులు, షేక్ అహ్మద్, చెంచయ్య, మహేష్ ఉన్నారు. బోగోలు టిడిపి మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు ఎల్.సుధీర్ బాబు పేట శ్రీధర్, పెండ్ర రాజేష్, చిలక జయరాం, బొంత సుధీర్, బోగోలు మండల వైసిపి నాయకులు సాతుపాటి ఉదయ్ కుమార్ బిట్రగుంట వర్కర్స్ అసోసియేషన్ నాయకులు సజ్జన్ రాజ, గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు అసోసియేషన్ సభ్యులు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ప్రజాశక్తి-కావలి : కావలి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం మాజీ రాష్ట్రపతి, భారతరత్న, డాక్టర్ ఎపిజె అబ్దుల్‌కలాం వర్ధంతిని జరుపుకున్నారు. మొదట కలాం చిత్రపటానికి పూలమాలలు అలంకరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ అబ్దుల్ కలాం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆకుల రమణయ్యతో పాటు సహాధ్యక్షుడు రవి కుమార్, కార్యదర్శి సాయిరాంసింగ్, ఉపాధ్యక్షులు వరప్రసాద్, వై వి నాగేశ్వరరావు, కృష్ణారావు, జమున, తదితరులున్నారు.

ప్రజాశక్తి-కావలి : నేటి విద్యార్థులకు దివంగత నేత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం మార్గదర్శకుడని డి.బి.ఎస్. కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టిసుధీర్ నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో జరిగిన వర్ధంతి సభలో డాక్టర్ ఎపిజె అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ దామిశెట్టి. బాల సురేష్‌బాబు, పరిపాలన అధికారి జి.రమేష్ బాబు, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఉపాధి హామీ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆత్మకూరు ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ 16వ విడత గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొసీడింగ్ ఆఫీసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. 14వ తేదీ నుండి 23వ తేదీ వరకు జరిగిన సామాజిక తనిఖీలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి వేతనాలకు సంబంధించి పరిశీలనలో జరిగిన తప్పులకు గానూ రూ.101801, (ఉపాధి హామీ సంబంధించి) పంచాయతీరాజ్ నుండి రూ.1,46,102 రికవరీ చేశారు. ఈ రికవరీలను వెంటనే చెల్లించాలని ప్రొసీడింగ్ ఆఫీసర్ తెలిపారు. పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని అన్ని గ్రామాలలో పనులు ప్రారంభించాలని కోరారు. ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 2023 -24లో ఉపాధి హామీ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించలేదని సూచించారు. అదేవిధంగా ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.8,89,53708 ఖర్చు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిడి శంకర నారాయణ, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎస్ఆర్పి నాగార్జున, మండల టిడిపి నాయకులు, ఎపిఒ శిరీష డిఆర్‌పిఎస్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి కేత వేణుగోపాల్‌రెడ్డి

బోర్లు పరిశీలన

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని కచ్చిరి దేవరాయపల్లి, కొత్తపల్లి గ్రామాలలో శనివారం చేతిపంపు బోర్లను ఎంపిడిఓ తాజ్‌మసూర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న బోర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి జునైద్ అహ్మద్‌ను ఆయన ఆదేశించారు. కచ్చిరి దేవరాయపల్లి గ్రామంలో రోడ్లకు గ్రావెల్ వేయించాలని ఎంపిడిఓను గ్రామస్తులు కోరారు. మండల పరిషత్ విస్తరణ అధికారి రమేష్, గ్రామ సర్పంచ్ పోతల విజయమ్మ, టిడిపి నాయకులు బొల్లినేని రమణయ్య, బొల్లినేని శారకేశ్, వైసిపి నాయకులు పోతల నరసింహులు, పంచాయతీరాజ్ ఏఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌లో పరిశీలన

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని రేవూరు గ్రామంలోని సచివాలయంలో శనివారం ఆధార్ సెంటర్‌లో ఎంపిడిఓ తాజ్ మసూర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన ఆధార్ నమోదు, బయోమెట్రిక్, ఫోన్‌లింక్, అడ్రస్సు మార్పు వివరాలను డిజిటల్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని రేవూరు, అగ్రహారం సచివాలయాల్లో ఆధార్ సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. మండల పరిషత్ విస్తరణ అధికారి డి.రమేష్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

రూ.40వేలు వితరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన నలుగురి కుటుంబ సభ్యులకు శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఒక్కొక్కరికి రూ.10వేల వంతున మొత్తం రూ.40వేలు నగదును వితరణ చేశారు. 2వ వార్డు పరిధిలోని షేక్.బీబీ (58), 12వ వార్డు పరిధిలోని ఆత్మకూరు వెంకమ్మ (66), 23వ వార్డు పరిధిలోని కొమరగిరి పెదతిరుపతి (49), 23వ వార్డు పరిధిలోని షేక్ బీబీజాన్ (60) ఇటీవల కాలంలో మృతి చెందారు. ఈ కుటుంబాలను ప్రత్యక్షంగా పరామర్శించిన కంచి పరమేశ్వర్ రెడ్డి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున మొత్తం నగదు అందజేశారు.

30న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు మండల సర్వసభ్య సమావేశం 30వ తేదీన జరుగనున్నట్లు ఎంపిడిఓ తోట వెంకట క్రిష్ణకుమారి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె తెలిపారు.

జనసేన సభ్యత్వం నమోదు

ప్రజాశక్తి-కావలి : జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి, కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు వేములపాటి అజయ్‌బాబు సూచనల మేరకు కావలిలోని బ్రిడ్జి సెంటర్లో శనివారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించినట్లు జనసేన జిల్లా కార్యదర్శి సమ్మును వెంకటసుబ్బయ్య తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం బ్రిడ్జి సెంటర్‌లో కొనసాగుతుందని ప్రతిఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. నాయకులు జానీ, పాలంకు వెంకటేశ్వరావు, మురళీకృష్ణ, కందుల లక్ష్మి కవిత, జ్యోతి, షేక్ జిలాని, నాని, నయీమ్, ప్రవీణ్, సోమిశెట్టి భాస్కర్, కాలేశా పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కావలి : మునుసూరు చంద్రబాబు నాయుడు గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త, ఎ.పి.జె.అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా చిన్నారులకు పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు, గడ్డిబలపాలు, బాలింతలకు ఐరన్ సిరప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం ఆదిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుహాసిని, అంగన్‌వాడీ టీచర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనంతసాగరం : స్థానిక శ్రీ సయ్యదిన కరిముల్లా గంథ మహోత్సవం సందర్భంగా శనివారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నేపథ్యంలో దర్గా వద్దకు వచ్చే భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఒ రాజమ్మ మస్తాన్, హెల్త్ అసిస్టెంట్లు అబ్దుల్ ఖాదర్, టివి ఆర్ వి ప్రసాద్, ఆశాలు, పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : పిఆర్ 1 యాప్‌లో బుష్, డ్రెయిన్స్ క్లియరెన్స్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఇఒపిఆర్‌డి ఎన్.మల్లికార్జున పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 12 సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు హౌస్ ట్యాక్స్ రికార్డ్స్ ప్యూరిఫికేషన్ వేగవంతం చేయాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.

ప్రాథమిక పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని లింగంగుంట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఎంఇఒ-2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్, ఉపాధ్యాయుల హాజర రిజిస్టర్‌ను, రికార్డులను ఆయన తనిఖీ చేశారు. గ్రామంలోని బడిమాని వేసిన విద్యార్థులు గుర్తించి పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

34వ ఆరాధన మహోత్సవాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని దేపూరు గ్రామంలో వెలసి ఉన్న ఆంజనేయ స్వామి భక్త పెంచలయ్య స్వామి వారి 34వ ఆరాధన మహోత్సవాన్ని భక్తులు, నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొని పెంచలయ్య స్వామి వారి సమాధిని దర్శించుకుని పలువురు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు భాస్కర్‌నాయుడు, పెంచుల నాయుడు, రావిళ్ళ ఆదిశేషయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, సురేంద్ర, గ్రామ సర్పంచ్ రావిళ్ళ వెంకటేశ్వర్లు, మస్తానయ్య, కొల్ల ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఆగస్టుకు సంబంధించిన పెన్షన్లను ఇంటి వద్దకే అందిస్తారని లబ్ధిదారులు అందుబాటులో ఉండి నగదును తీసుకోవాలని ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుంచి ఇళ్ల వద్దనే అన్నిరకాల పెన్షన్ పంపిణీ పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది కొన్ని శాఖల ఉద్యోగులు అందజేస్తారన్నారు.

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-కావలి : కావలి పాతూరు పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో శనివారం కావలి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారిచే 80మంది ఎన్‌సిసి కేడేట్స్‌కు ఉచిత రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సుబ్బారావు, ఎన్‌సిసి అధికారి మస్తాన్‌వలీ, రెడ్‌క్రాస్ టెక్నీషియన్స్ పద్మావతి, శేషమ్మ పాల్గొన్నారు.

ఆస్తులను దోచుకోవడానికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

ప్రజాశక్తి-కావలి


పరిశీలిస్తున్న ఎంఎల్ఎ కావ్యక్రిష్ణారెడ్డి

గత వైసిపి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొని వచ్చి ప్రజల ఆస్తులను దోచుకువాలని కుట్ర పన్నిందని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం కావలికి విచ్చేసిన ఆయన శనివారం అన్న క్యాంటిన్ భవనాన్ని, 100 అడుగుల జాతీయ జెండా నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వైసిపి నేతలు, వారి అనుచరులు దోచుకోవడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొని రావడం జరిగిందన్నారు. దానిని గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకొని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామన్నారు. పొలాల వద్ద హద్దు రాళ్లపై జగన్ బొమ్మలు దిష్టి బొమ్మలు లాగా మారాయన్నారు. ఇకపై ప్రజల ఆస్తులను ఎవరూ లాక్కో లేరని, ఇక నిశ్చింతగా రైతులు ఉండవచ్చన్నారు. పేదవాడికి కడుపు నిండా అన్నం పెట్టేందుకు అన్న క్యాంటీన్‌లు ఆగష్టు 15 నుండి ప్రారంభం కాబోతున్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా అన్న క్యాంటీన్‌లు మూసివేసి, పేదల కడుపులు కొట్టిందని విమర్శించారు. అన్న క్యాంటీన్ ఎదురుగా సొంత నిధులతో కావలికి ఐకానిక్‌గా 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండా ఏర్పాటు చేస్తున్నామని, కావలి ఖ్యాతిని నలు దిశల వ్యాప్తి చెందే విధంగా సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డి.ఇ. సాయి రామ్, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



'ఒవెల్' స్కూల్లో వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని అన్నమయ్య సర్కిల్ శ్రీనగర్ కాలనీలో ఒవెల్ ఐసిఇ అండ్ వి -అడ్వాన్స్ స్కూల్లో వారం రోజులు పాటు జరిగిన ఇంగ్లీష్ ఎక్స్పాటిక వేడుకల్లో భాగంగా శనివారం కల్మినేషన్ వేడుక సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ ఆర్.వేణు, ప్రధానోపాధ్యాయులు యు.రమణ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఒవెల్ స్కూల్స్ చైర్మన్ వేణు మాట్లాడుతూ ఈ రకమైన ప్రోగ్రామ్స్ వల్ల విద్యార్థులలో గ్రామర్ స్కిల్స్ డెవలప్ అవుతాయని చెబుతూ విద్యార్థులను సంస్కరించారు. రమణ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో ఫంక్షనల్ అండ్ స్ట్రక్చరల్ గ్రామర్ స్కిల్స్ పెంచుతాయన్నారు. ఈ రకమైన కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో రైటింగ్స్, రీడింగ్, కోఆర్డినేటింగ్ స్కిల్స్‌తోపాటు లైఫ్ స్కిల్స్ పెంపొందుతాయని స్పష్టంగా తెలియజేశారు. సిఇఒ ప్రమీల, జిఎం.మహదేవ్, ఇడి.బాలు, రఫీ, మీనాక్షి, ఎజిఎం కిషోర్, నాగలక్ష్మి, మల్లికార్జున, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయంతో ప్రమాదం

ప్రజాశక్తి-మర్రిపాడు


మాట్లాడుతున్న నగేష్

మతోన్మాద పాలకులు వారికి కొమ్ము కాస్తున్న కార్పొరేట్ శక్తులు కలిసి మత రాజకీయాలు చేస్తున్నారని, అది సమాజానికి ప్రమాదకరమని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం సిపిఎం కార్యకర్తలకు, శ్రేణులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో వక్తగా జెట్టి శేషారెడ్డి భవన్ కమిటీ సభ్యులు నగేష్ పాల్గొని మాట్లాడుతూ మోడీ చేపట్టిన పెద్దనోట్ల రద్దు చర్యతో కోట్లాదిమంది ప్రజల జీవనోపాధులు దెబ్బతిన్నాయన్నారు. పెద్దనోట్ల రద్దు తర్వాత ఎంత నల్లధనం బయటికి తీశారు అనేదానిపై లెక్కలు చెప్పలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఆదానికి రూ.50వేల కోట్లు ఉండగా 2014 నుండి 2024కు రూ.18లక్షల కోట్లకు చేరుకున్నారన్నారు. కదిలించి మాట్లాడే కమ్యూనిస్టులను అనుగదొక్కు తున్నారని వ్యాఖ్యానించారు. నూటికి 80శాతం టివి ఛానళ్లు అదాని అంబానీ చేతుల్లో ఉన్నాయని, పెద్ద పేపర్లలో కార్మికుల హక్కులు చట్టాల గురించి రాయరన్నారు. చట్ట సభల్లో పెన్షన్లు తదితర అంశాలపై మాట్లాడేది కమ్యూనిస్టులేనన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులకు ఓటు వేయరని, డబ్బులున్న వారు ప్రభుత్వాలను నడుపుతూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, సిపిఎం మండల కార్యదర్శి రహంతుల్లా, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు రత్తయ్య, జి శ్రీనివాసులు, తిక్కవరం శాఖ కార్యదర్శి గంగినేని తిరుపతి, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు మూలి ప్రమీల, రాములమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాతలు ఆదుకోవాలి..

ప్రజాశక్తి-ఉదయగిరి : డెంగీతో చికిత్స పొందుతున్న రామారావును దాతలు ఆదుకోవాలని కుటుంబ సభ్యులు ప్రార్థిస్తున్నారు. స్థానిక ఉదయగిరి కావలి రోడ్డు పూసల కాలనీకి చెందిన చెప్పలి రామారావుకు డెంగీ జ్వరంతో ఉదయగిరి సిహెచ్‌సిలో 5రోజుల పాటు చికిత్స పొందారు. రోజురోజుకు తెల్ల రక్త కణాలు క్షీణించడంతో నెల్లూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిని ఆశ్రయించారు. అక్కడ ఖర్చులు అధికమవడంతో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పేద కుటుంబం కావడంతో మెరుగైన వైద్య సేవలు అందించలేక పోతున్నామని దాతలు ముందుకు రావాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

ప్రయివేట్ స్కూల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని ఉప్పలపాడు హైవేలో ఉన్న ప్రయివేటు పాఠశాలలో ఎంఇఒలు జానకి రామయ్య, కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థి తండ్రిపై జరిగిన దాడుల నేపథ్యంలో ఎంఇఒలు ఉపాధ్యాయుల దగ్గర వివరాలు సేకరించారు. విద్యార్థి సంఘం నాయకులతో చర్చించారు. అనంతరం గ్రామాలలోని తల్లిదండ్రుల వద్ద వివరాలు సేకరించారు. జిల్లా విద్య శాఖ అధికారి ఆదేశాల మేరకు ప్రయివేట్ స్కూలుపై విచారణ, తనిఖీ చేసామని నివేదికను తయారుచేసి అందజేస్తామని తెలిపారు.

స్థల పరిశీలన

ప్రజాశక్తి-సంగం : సంగం కొండ సమీపంలో ఇసుక డంపింగ్ యార్డ్ కోసం శనివారం ఆర్‌డిఒ మధులత స్థల పరిశీలన చేశారు. త్వరలో నూతన ఇసుక పాలసీ అమలులో వస్తున్న నేపథ్యంలో రీచ్ నుండి ఇసుకను డంపింగ్ చేసేందుకు కావాల్సిన స్థలం కోసం ఆమె పలు ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో పరిశీలన

ప్రజాశక్తి-కావలి : స్థానిక వెంగళరావు నగర్‌లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక సి.బి.ఎస్.ఇ. ఉన్నత పాఠశాలను శనివారం కావలి ఉప విద్యాశాఖాధికారి పి.రఘురామయ్య తనిఖీ చేశారు. "శిక్షా సప్తాహ్" కార్యక్రమంలో భాగంగా ఆరో రోజు మొక్కల్ని నాటారు. నాడు-నేడు పనులను పరిశీలించి ప్రధానోపాధ్యాయులు హయ్యుల్ హయ్యామ్‌కు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆత్మకూరు ఉప విద్యాశాఖాధికారి కె.గోపాల్ పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 6వ రోజు పర్యావరణం పరిరక్షణ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప విద్యాశాఖాధికారి కె.గోపాల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని విద్యార్థినీ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా అమ్మ చెట్టు పేరుతో విద్యార్థుల తల్లితో సుమారు 70 మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరిపంట పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి

బుచ్చిరెడ్డిపాలెం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో కె.వి.కె. శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్ కుమార్ నాయక్ వివిధ గ్రామాలలోని వరిపంటను సందర్శించారు. శనివారం వవ్వేరు గ్రామంలో వరి పంట ప్రస్తుతం వెన్ను దశలో ఉన్నదని, ఎక్కువగా కాండం తొలుచు పురుగు గుర్తించి నివారణకు పలు సూచనలు చేశారు. గ్రామ వ్యవసాయ అధికారులు మీరయ్య, కీర్తన, రైతులు పాల్గొన్నారు.

మినీ గోకులాలకు రాయితీ

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలానికి గోకులం పథకం కింద పాడిపశువులకు 90శాతం గొర్రెలు మేకలు కోళ్లకు 70శాతం రాయితీపై షెడ్లు నిర్మించుకునేందుకు మండలానికి 25 గోకులం యూనిట్లు మంజూరైనట్లు గండిపాలెం ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి అనూష శనివారం తెలిపారు. ఆసక్తి కలిగిన రైతువారి పరిధిలోని రైతు సేవ కేంద్రాల్లో పశుసంవర్ధక సహాయకులు, పశువైద్యాధికారులను సంప్రదించి దరఖాస్తులు దాఖలు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండాలన్నారు.

లక్ష్మి సెహగల్ వర్ధంతి

ప్రజాశక్తి-మర్రిపాడు


లక్ష్మిసెహగల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో మహిళా కెప్టెన్‌గా పనిచేసిన లక్ష్మి సెహగల్ జీవితం ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకం కావాలని ఐద్వా సంఘం నాయకులు మూలి ప్రమీల పేర్కొన్నారు. లక్ష్మి సెహగల్ 110వ వర్ధంతి సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనంలోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మద్య నిషేధం వంటి జాతీయ పోరాటాల్లో ఆమె పాల్గొన్నారని తెలిపారు. ప్రజలకు సేవ చేసేందుకు లక్ష్మి సెహగల్ ముందుండే వారన్నారన్నారు. యువతను ప్రోత్సహించే వారన్నారు. ఆ తర్వాత ఆమె కుటుంబం కూడా ప్రజాసేవ చేసిందన్నారు. సెహగల్ కుమార్తె సుభాషిణీ అలీ వైద్యురాలిగా చివర వరకు ప్రజలు, మహిళల కోసం సేవ చేసిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా పలు స్థాయిల్లో సమాజ సేవకు అంకితమయ్యారని తెలిపారు. 1971లో సిపిఎం తరపున ఆమె రాజ్యసభ సభ్యురాలుగా ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, మండల కార్యదర్శి రహంతుల్లా, తిక్కవరంశాఖ కార్యదర్శి గంగినేని తిరుపతి, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో విచారణ వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు

మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కోట్లాది రూపాయలు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తడం, వీటిపై స్పందించిన గతంలో కమిషనర్‌గా ఉన్న వికాస్‌మర్మత్ ఎస్‌పితో మాట్లాడి ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసుశాఖ కేసు నమోదు చేయకుండా కాలయాపన చేయడంతో ప్రజాసంఘాలు, న్యాయవాదులు ఆందోళనలు చేపట్టాయి. దాంతో దిగివచ్చిన పోలీసుశాఖ ఎట్టికేలకు ఫోర్జరీ కేసును నాన్ బెయిలబుల్ కేసుగా నమోదు చేసింది. పోలీసులు విచారణ ప్రారంభించడం, నాన్‌బెయిల్ కేసుగా నమోదు చేయడంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసిపి నాయకుల్లో కొందరు వ్యక్తులు అండర్ గ్రౌండ్‌కు వెళ్లగా, మరికొంత మంది ఏకంగా జిల్లాను వదిలి వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బృందాలుగా విడిపోయి సాంకేతిక పద్ధతులను అనుసరించి జిల్లాను వదిలి వెళ్ళిన వారు ఎక్కడికి వెళ్ళారో తెలుసుకొనే ప్రక్రియ ప్రారంభించారు. ఏకంగా డిఎస్‌పి తన సహచర సిబ్బందితో కార్పొరేషన్ కార్యాలయంలో ఒక్కొక్క విభాగాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించడంతోపాటు ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిని సైతం విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉంటే నుడా విభాగంలో సైతం భారీగా అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం ముగ్గురు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసే పనిలో బిజీబిజీగా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో నాడు-నేడు పథకంలో అదనపు తరగతి గదులు, బాత్‌రూముల నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఇచ్చింది. ఈ నిర్మాణ పనులు నాసిరకంగా జరిగాయని అప్పట్లోనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణలు అన్ని నిరాధారమైనవని అప్పటి ప్రభుత్వం కొట్టి పడేసింది. ఆ ఆరోపణలు అన్ని నిజమైనవనేందుకు సాక్ష్యంగా నాడు-నేడు పథకంలో నిర్మించిన అదనపు తరగతి గదులు గోడలు కూలి, సిమెంటు పెళ్లలు పడిపోయి విద్యార్థులకు గాయాలైన ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా నగరంలోని చిన్న కెఎన్ఆర్ మున్సిపల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గురుమహేంద్ర అనే విద్యార్థి మృత్యువాత పడ్డాడు. దాంతో విద్యార్థి సంఘాలు జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో నాడు-నేడు పనుల్లో భాగంగా చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలన్నింటిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పనిచేస్తున్న పలువురు అధికారులను ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన అనంతరం ఎన్నికల నిబంధనల మేరకు మరో ప్రాంతానికి బదిలీ చేశారు. అయితే ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయం పాలై టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం బదిలీపై వెళ్లిన అధికారులు తిరిగి తమ సొంత స్థానాలకు వచ్చి బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. అయితే బదిలీపై వెళ్లిన అనేక మంది అధికారులు తిరిగి తమ యథాస్థానంలో విధులు నిర్వహించేందుకు సిద్ధంగా లేరన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం హయాంలో వైసిపి నాయకులకు అనుకూలంగా వ్యవహరించిన తమపై ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వానికి చెందిన నాయకులు వేదింపులకు ఎక్కడ గురికావాల్సి వస్తుందో అన్న భయాందోళనల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వైసిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిన అనంతరం అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం జిల్లాలోని అన్ని విభాగాల అధికారులకు స్థాన చలనం కలిగించింది. ఈ క్రమంలో జిల్లాకు చెందిన ఐఎఎస్‌లను, ఐపిఎస్‌లను మార్చి వేసింది. కేంద్రం బడ్జెట్ సమావేశంలో రాష్ట్రానికి రాజధాని నిర్మాణం కోసం రూ.15వేల కోట్లు అప్పుగా అందజేయిస్తామని ప్రకటిం చింది. ఈ వ్యవహారంపై విపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం తెలియజేస్తూ జిల్లాలో ముఖ్యంగా వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన పార్లమెంట్ సభ్యులను టిడిపి, జనసేన పార్టీలు కలిగి ఉన్నప్పటికీ రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేయాలని ఎందుకు డిమాండ్ చేయలేక పోయిందంటూ రాజకీయ పార్టీలు ప్రశ్నిస్తున్నాయి.

వీక్షణం